

నేస్తానికి 'పట్టం'

మహబూబాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : సీఎం అనుముల రేవంత్‌రెడ్డితో పదహారేళ్ల సహవాసం.. నమ్మకానికి నిలువుటద్దంగా నిలిచిన మానుకోట మాజీ ఎమ్మెల్యే వేంనరేందర్‌రెడ్డికి కాంగ్రెస్ సర్కార్‌లో సముచిత స్థానం లభించింది. ముందుగా 'ఆంధ్రజ్యోతి' చెప్పినట్టే రేవంత్‌రెడ్డితో పాటు తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడిగా వేంను నియమిస్తూ ఆదివారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబాబాద్ జిల్లాకు దక్కిన ఈ అరుదైన గౌరవంతో అభివృద్ధిపై ఆశలు చిగురిస్తున్నాయి. తెలుగుదేశం పార్టీలో ఉన్నప్పట్నుంచి దాదాపు 16 ఏళ్లుగా రేవంత్‌రెడ్డి, వేం నరేందర్‌రెడ్డి ఆప్తమిత్రులుగా మెలుగుతూ వస్తున్నారు.

రజాకార్ల వ్యతిరేక నేత మనవడిగా..

వేం నరేందర్‌రెడ్డి కుటుంబానికి తెలంగాణ ఉద్యమ నేపథ్యం ఉంది. రజాకార్ల దురాగతాలకు ఎదురొడ్డి పోరాడిన వేం పుల్లారెడ్డి వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న నరేందర్‌రెడ్డి ఆదినుంచి నాయకత్వ లక్షణాలు కలిగి ఉన్నారు. ఆయన కుటుంబమంతా రాజకీయ మయమే. పూర్వ మహబూబాబాద్ పాతా తాలుకాలోని గూడూరు మండలం తీగలవేణి వాస్తవ్యులైన వేం పుల్లారెడ్డి నవాబుల కాలంలో రజాకార్ల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు నడిపిన యోధుడిగా సుపరిచితులు. ఆయన స్వస్థలం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలోని కేసముద్రం మండలం అర్పనపల్లిలో కూడా ఆస్తులు సంపాదించుకుని నలుగురి తలలో నాలుకలాగా మెలిగారు. ఆయన కుమారుడే వేం చెన్నకృష్ణారెడ్డి. ఈయన తన పదహారేళ్ల వయస్సులోనే రజాకార్ల దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమించి, తీగలవేణి నుంచి అర్పనపల్లికి వచ్చి కొద్దికాలం పాటు రజాకార్ల నిర్బంధంతో అజ్ఞాతంలో గడిపారు. గ్రామపెద్దగా వ్యవహరిస్తూ గూడూరు, కేసముద్రం, నెక్కొండ మండలాల్లోని దాదాపు 50 గ్రామాల్లో ఎవరికి ఏ ఆపద వచ్చినా.. తానే ఆదుకుంటూ పేరుగడించారు. అంతేకాదు.. నాయక్‌పల్లి, తీగలవేణి, అర్పనపల్లి గ్రామాలు కలిపి ఒకే గ్రామపంచాయతీ కింద ఉన్నప్పుడు సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై దాదాపు 20 సంవత్సరాల పాటు ప్రాతినిధ్యం వహించారు. ఇక్కడి వ్యవసాయాన్ని నమ్ముకుని పనిచేసిన ఆయనకు ఇద్దరు కుమారులు సంతానం. చిన్న కుమారుడే వేం నరేందర్‌రెడ్డి. ఈయన (అన్న) సోదరుడైన దివంగత వేం పురుషోత్తంరెడ్డి మొదట్నుంచి నరేందర్‌రెడ్డితో కలిసి రాజకీయాల్లో పనిచేశారు.

జిల్లాకు విప్‌తో పాటు సలహాదారు..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలుత జిల్లాలోని డోర్నకల్ నుంచి సీనియర్ రాజకీయవేత్త, మాజీ మంత్రి రెడ్యానాయక్‌పై ఎమ్మెల్యేగా విజయం సాధించిన జాటోతు రాంచంద్రునాయక్‌కు ప్రభుత్వ విప్ పదవి ఇవ్వడంతో జిల్లాకు ఆదిలోనే ప్రాధాన్యత లభించినట్లయింది. తాజాగా సీఎం సలహాదారుడు, ప్రభుత్వ సలహాదారుడిగా ఇదే జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్‌రెడ్డికి ప్రాధాన్యత కలిగిన పదవి ఇవ్వడంతో జిల్లా నుంచి ఇరువురికి ప్రభుత్వ పాలనలో అవకాశం కల్పించినట్లయింది. జిల్లాలో పూర్తిస్థాయి నియోజకవర్గాలుగా ఉన్న డోర్నకల్, మహబూబాబాద్‌కు ప్రాతినిధ్యం లభించడంతో జిల్లా అభివృద్ధిపై ఆశలు చిగురిస్తున్నాయి.

- మానుకోట జిల్లాకు దక్కిన అరుదైన గౌరవం
- ముఖ్యమంత్రి, ప్రభుత్వ సలహాదారుగా నరేందర్‌రెడ్డి
- గిరిజన జిల్లా అభివృద్ధిపై చిగురిస్తున్న ఆశలు

సీఎం రేవంత్ సర్కార్‌లో 'వేం'కు సముచిత స్థానం

1977 నుంచి రాజకీయాల్లో...

వేం సోదరులు 1977 నుంచి జనతా పార్టీలో ఉంటూ పూర్తిస్థాయి రాజకీయాల్లో కొనసాగారు. 1983 తెలుగుదేశం ఆవిర్భావంతోనే ఇరువురు టీడీపీలో చేరి, క్రమశిక్షణ గల కార్యకర్తలుగా గుర్తింపు తెచ్చుకున్నారు. కాగా, వేం నరేందర్‌రెడ్డి వరంగల్ సీకెఎం కళాశాలలో గ్రాడ్యుయేషన్ చేస్తున్న కాలంలోనే సెక్రటరీగా విద్యార్థి సంఘ నేతగా పనిచేశారు. కేసముద్రంలో రీక్రియేషన్ క్లబ్ ఏర్పాటు చేసి దాదాపు 15ఏళ్ల పాటు అనేక సేవ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. 1994లో వేం పురుషోత్తంరెడ్డి, 1999లో నరేందర్‌రెడ్డి మహబూబాబాద్ నుంచి ఎమ్మెల్యేగా పోటీకి ప్రయత్నించారు. నరేందర్‌రెడ్డిని ఉమ్మడి వరంగల్ జిల్లా జడ్పీ చైర్మన్‌గా బరిలో నిలిచేందుకు నల్లబెల్లి నుంచి జడ్పీటీసీగా పోటీచేసి ఓటమిపాలయ్యారు. అనూహ్య పరిణామాల్లో 2004 ఎన్నికల్లో మహబూబాబాద్ నుంచి టీడీపీ టికెట్‌తో విజయం సాధించి ఎమ్మెల్యేగా అధికారం చేపట్టారు. ఆ తర్వాత మహబూబాబాద్ నియోజకవర్గం అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో ఎస్టీకి రిజర్వుడ్ కావడంతో ఇక్కడ పోటీచేసే అవకాశం చేజారిపోయింది. 2010 ఉప ఎన్నికల్లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీచేసి ఓటమిపాలయ్యారు. 2015లో ఎమ్మెల్యేల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ తరుపున పోటీ చేశారు.

2017 నుంచి కాంగ్రెస్ పార్టీలో..

రాజకీయ పరిణామాల నేపథ్యంలో 29 అక్టోబర్ 2017న తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డితో కాంగ్రెస్ పార్టీలో చేరారు. 26 జూన్ 2021లో టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడిగా నియామకమయ్యారు. 2023లో తెలంగాణ ఎన్నికల ప్రచార కమిటీ, ప్లానింగ్ కమిటీ కన్వీనర్‌గా ఎన్నికయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డికి.. నరేందర్‌రెడ్డికి మధ్య సుమారు పదహారేళ్ల నుంచి స్నేహబంధం కొనసాగుతోంది. టీడీపీలోనూ ఇద్దరు కలిసే ఉన్నారు. 2004 నుంచి 2009 మధ్యలో ఎమ్మెల్యేగా కొనసాగిన వేంనరేందర్‌రెడ్డికి 2007లో ఎమ్మెల్సీగా ఎన్నికైన రేవంత్‌రెడ్డితో పరిచయం ఆత్మీయబంధంగా మారింది.

2009లో మహబూబాబాద్ ఎస్టీకి రిజర్వుడ్ కావడంతో వేం నరేందర్‌రెడ్డి రాజకీయంగా అవకాశం కోల్పోయారు. ఆ తర్వాత నుంచి రేవంత్‌రెడ్డికి ఆప్తుడిగా వ్యవహరిస్తూ వస్తున్న నరేందర్‌రెడ్డి తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో టీపీసీసీ చీఫ్‌గా రేవంత్‌రెడ్డి హాజరైన ప్రతీ ప్రచార సభకు షాడోగా కొనసాగారు. అంతేకాకుండా రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా ఆయన రాజకీయ వ్యవహారాలను చూశారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ప్రభుత్వం అధికారంలోకి రావడానికి తనదైన పాత్రను పోషించారు. ఆయన స్నేహానికి.. నమ్మకానికి.. ప్రతిభకు గుర్తింపునిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగానే కాకుండా, సీఎంకు కూడా సలహాదారుడిగా కొనసాగే క్యాబినెట్ హోదాను వేం నరేందర్‌రెడ్డి కల్పించడం విశేషం.



అర్పనపల్లిలో వేం నరేందర్‌రెడ్డి ఇల్లు



సర్వం సిద్ధం

మానుకోటలో విద్యుత్ దీపాలతో అలంకరించిన శ్రీరామాలయం

- విద్యుత్ దీపాలతో శ్రీరామాలయాల అలంకరణ
- నేడు అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ
- జిల్లాలోని ఆలయాల్లో పూజలు నిర్వహించనున్న భక్తులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 21 : ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అయోధ్యలో సోమవారం బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని మానుకోట జిల్లా వ్యాప్తంగా శ్రీరామాలయాలను సిద్ధం చేశారు. బాలరాముడి విగ్రహప్రాణప్రతిష్ఠ చేసే సమయంలో ఆలయాల్లో పూజలు చేసేందుకు అన్నిఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఇప్పటికే ప్రతీ ఇంటికి శ్రీరాములోరి అక్షింతలను పంపిణీ చేయడంతో పాటు అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ ఆవశ్యకతను వివరించారు. జిల్లాలో భక్తులు ర్యాలీలు నిర్వహించారు. తమ ఇళ్లపై జైశ్రీరాం కాషాయ జెండాలను కట్టుకున్నారు. ఆదివారం దీపాలు వెలిగించి దీపావళి జరుపుకోవాలన్న పిలుపునందుకున్న ప్రజలు పండుగను జరుపుకున్నారు. శ్రీరామాలయాలన్నీ విద్యుత్ దీపాలతో అలంకరించడంతో మిరుమిట్లు గొలుపుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా బాలరాముడి ప్రాణప్రతిష్ఠను కన్నులపండువగా జరుపకునేందుకు ప్రజలంతా సన్నద్ధమయ్యారు.



మేచరాజుపల్లిలో జైశ్రీరాం జెండాలతో ర్యాలీతీస్తున్న గ్రామస్థులు

ఆంగ్లంపై భయాన్ని తొలగించాలి

- జిల్లా విద్యాశాఖాధికారి రామారావు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 21 : విద్యార్థులకు ఆంగ్లంపై భయాన్ని తొలగించే విధంగా బోధన చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి రామారావు సూచించారు. మహబూబాబాద్‌లో ఆదివారం ఇంగ్లీష్‌లో స్పెల్ విజార్డ్‌అండ్ డ్రామా పోటీల కోసం తయారు చేసిన ఐపాస్ 2024 లక్ష్య ఆధారిత ప్రశ్నా పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యన భ్యసిస్తున్న విద్యార్థులకు ఇంగ్లీష్ సబ్జెక్టుపై భయాన్ని తొలగించి, ఆసక్తిని పెంపొందించే విధంగా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా) ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయుల సౌకర్యార్థం ప్రతీ సంవత్సరం స్టడీ మెటీరియల్ తయారు చేయడం జరుగుతుందని సంఘం ప్రధాన కార్యదర్శి రామ్మోహన్ తెలిపారు. కార్యక్రమంలో సైదులోరెడ్డి, శ్యామలాదేవి, శ్రీనివాస్, యాదగిరి పాల్గొన్నారు.

సాంకేతిక, కళల సమ్మిళితంగా..

విజ్ఞానం, వినోదాన్ని పంచిన టెక్నోజియాన్

- ముగిసిన మూడురోజుల వేడుక
- స్ఫూర్తి నింపిన అతిథి ప్రసంగాలు
- విజేతలకు బహుమతుల ప్రదానం



ఏజాజ్ ఈవెంట్



మాట్లాడుతున్న డాక్టర్ సురేష్ కుమార్

హనుమకొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు మూడు రోజుల పాటు ప్రతిష్ఠాత్మకమైన వరంగల్ నిట్ కళాశాలలో అంగరంగ వైభవంగా నిర్వహించిన టెక్నోజియాన్-2024 ఆదివారం ముగిసింది. టెక్నోజియాన్‌లో పాల్గొన్న వివిధ రాష్ట్రాల నిటియన్లు గుండెల నింపుకున్న అనుభూతులు, సరికొత్త ఆవిష్కరణ వల్ల కలిగిన అవగాహనలు, ఆలోచనలతో తిరుగు ముఖంపట్టారు. టెక్నోజియాన్‌లో వివిధ రాష్ట్రాల నుంచి వెయ్యి మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ అంశాలకు సంబంధించి 40కిపైగా ఈవెంట్లను నిర్వహించారు. వందకుపైగా సైన్స్ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. నిట్ విద్యార్థులతో పాటు నగరంలోని పలు పాఠశాలలకు చెందిన రెండు వందల మందికిపైగా విద్యార్థులు సైతం ఆయా సైన్స్‌ఫెయిర్లలో ప్రదర్శించి బహుమతులను గెలుచుకున్న ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. ఈవెంట్లు, ఎగ్జిబిట్లు, స్పాట్ ఈవెంట్లు, వర్క్‌షాపులు, అతిథి ప్రసంగాలు విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. శాస్త్ర, సాంకేతికరంగాల్లో ఇటీవలకాలంలో చోటు చేసుకున్న సరికొత్త ఆవిష్కరణలను ఆకళింపు చేసుకునేందుకు, తమకు కలిగిన ఆలోచనలను తోటి విద్యార్థులతో పంచుకునేందుకు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖుల స్ఫూర్తిదాయక ప్రసంగాలను వినేందుకు టెక్నోజియాన్ వేదికగా నిలిచింది. ఈవెంట్లలో విద్యార్థులు పోటాపోటీగా పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో విజేతలకు నగదు బహుమతులను ప్రదానం చేశారు.

అకట్టుకున్న ప్రసంగాలు, వర్క్‌షాపులు

టెక్నోజియాన్ రెండోరోజు శనివారం రెడ్‌బస్ సీఈవో ప్రకాశ్ సంగం చేసిన ప్రసంగం విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపింది. టి-వర్క్ ప్రోటోటైపింగ్, త్రీడీ ప్రింటింగ్‌పై వర్క్‌షాపులు విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

ఇందులో పాల్గొన్నవారు తయారీరంగానికి సంబంధించి ఒక ప్రపంచాన్ని చూశారు. ప్రఖ్యాత వక్త డాక్టర్ నరసమ్మ మిట్టపల్లి వైజ్ఞానిక ప్రసంగం ప్రేక్షకులను కట్టిపడవేసింది. ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్ ఈవెంట్, ఎఫ్‌పీవి రేసింగ్, ఎస్కేప్ రూమ్ ఈవెంట్లు ఆకట్టుకున్నాయి. ఇన్నోవేటివ్ స్పియర్ ఎక్స్‌పోకు హాజరైనవారు సృజనాత్మకతలో మునిగిపోయారు. విభిన్నరంగాల్లో కొత్త ఆవిష్కరణలు ఆలోచనల హద్దులను చెరిపేసింది. పాఠశాల విద్యార్థులు రూపొందించిన పలు రోబోలతో నిర్వహించిన రోబోటిక్స్ ఎగ్జిబిషన్ యువ మనస్సులను ఆకట్టుకున్నాయి.

సాంకేతిక, కళల సమ్మేళనం

మూడోరోజు టెక్నోజియాన్‌లో ప్రముఖ ఇస్రో రిటైర్డ్ శాస్త్రవేత్త డాక్టర్ టీఎస్ సురేష్‌కుమార్ అతిథి ప్రసంగం హైలైట్‌గా నిలిచింది. మరో ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ బీజీలీ బాలక్రిష్ణన్ సెషన్ విద్యార్థులను కట్టిపడేసింది. స్పాట్‌లైట్ ఈవెంట్లలో జహాజ్ అందరిని విశేషంగా ఆకట్టుకున్నది. వీఆర్ క్రికెట్ ఈవెంట్ సంప్రదాయ ఆటకు వర్చువల్ ట్విస్టునిచ్చింది. కోడ్‌మేజ్ ఈవెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు కోడింగ్‌లో నైపుణ్యాన్ని పెంచుకునేందుకు వీలుకల్పించింది. సాంకేతికత, వినోదం కలగలిసిన ఈ సమ్మేళనం మొత్తం మీద విద్యార్థులకు కొత్త అనుభూతిని ఇచ్చింది. ట్రెండింగ్ ఫిట్ ఈవెంట్ మార్కెట్ ఔత్సాహికులతో సందడి చేసింది. మెకానికల్, మెటలర్జికల్ ఇంజనీరింగ్ నమూనా ప్రదర్శన రంగంలో అత్యాధునిక పరిణామాలను దర్శింప చేసింది. మేధోపరమైన విజ్ఞానాన్ని పెంపొందించడంలో టెక్నోజియాన్ లక్ష్యాన్ని హైలైట్ చేస్తూ, అలాగే పరిశోధనాపత్రాల ప్రదర్శనలపై దృష్టి సారిస్తూ చివరి రోజు కార్యక్రమం ముగిసింది. సాంకేతికత, కళల సంగమంగా త్రీడీ ప్రింటింగ్ పిక్సెల్స్ టు పోర్ట్రేయిట్ ఈ టెక్నోజియాన్‌లో అత్యంత ఆసక్తికరమైన అంశంగా నిలిచింది. స్వర్దక్ వాహన ప్రదర్శన మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థుల ప్రతిభకు అద్దం పట్టింది. ఆల్ టెర్రేయిన్ వాహనం వరంగల్ నిట్ మెకానికల్ విద్యార్థుల నైపుణ్యానికి ప్రతీకగా నిలిచింది.

ముందస్తు 'జాతర'

భక్తులతో కిటకిటలాడిన మేడారం

- తరలివచ్చిన 3 లక్షల మందికి పైగా జనం
- వనదేవతలకు ప్రత్యేక పూజలు



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారం, జనవరి 21 : ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం ఆదివారం కిక్కిరిసిపోయింది. వనదేవతలను దర్శించుకోవడానికి 3 లక్షల మందికి పైగా భక్తులు తరలివచ్చారు. మహాజాతర ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజులపాటు జరగనుండగా ముందస్తుగానే మొక్కులు చెల్లించుకున్నారు. మేడారం చేరుకున్న భక్తులు ముందుగా జంపన్నవాగు వద్ద పుణ్య స్నానాలు ఆచరించారు. బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్‌ను అందుబాటులోకి తేవడంతో వాగులో నీటి ప్రవాహం లేకున్నప్పటికీ పుణ్యస్నానాలు ఆచరించి కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించుకున్నారు. అనంతరం నిలువెత్తు బంగారం (బెల్లం)తో తులాభారం వేయించి గద్దెల వద్దకు చేరుకున్నారు. క్యూలైన్ల ద్వారా వనదేవతలను దర్శించుకున్నారు. పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరె, సారె, కొబ్బరికాయలు సమర్పించుకుని చల్లగా చూడాలని తల్లులను వేడుకున్నారు. మేకలు, గొర్రెలు, కోళ్లను పెద్దసంఖ్యలో బలిచ్చారు. భారీగా భక్తుల రాకపోత మేడారం చుట్టుపక్కల పరిసరాలు, అటవీప్రాంతం, విడిది చేసిన ప్రదేశం కిక్కిరిసిపోయింది. భక్తులు ఇక్కడే వంటలు చేసుకుని బంధుమిత్రులతో విందు భోజనాలు ఆరగించారు. సంక్రాంతి సెలవుల సమయంలో మొదలైన భక్తుల రద్దీ క్రమేపీ పెరుగుతోంది. జాతర సమయం దగ్గరపడుతున్న క్రమంలో బుధ, గురు, ఆదివారాలు, సాధారణ సెలవురోజుల్లో భక్తుల సంఖ్య లక్షలకు చేరే అవకాశం ఉంది. ఈమేరకు అధికార యంత్రాంగం సౌకర్యాలను మెరుగుపరచాలని సర్వత్రా కోరుతున్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

మహాజాతరను ఈసారి ప్లాస్టిక్ రహితంగా జరిపించాలని ప్రభుత్వం ప్రణాళిక రచిస్తోంది. ఈనేపథ్యంలో ఏటూరునాగారం ఐటీడీఏ ఆధ్వర్యంలో రూపొందించిన జ్యూట్ బ్యాగులను స్థానికంగా పంపిణీ చేస్తున్నారు. ప్లాస్టిక్ నిషేధంపై ఐటీడీఏ పీవో అంకిత్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు.

గంటపాటు ట్రాఫిక్ జామ్

వనదేవతలను దర్శించుకోవడానికి భక్తులు రాష్ట్ర నలుమూలల నుంచి ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో తెల్లవారుజాము నుంచే మేడారం చేరుకున్నారు. భక్తుల రద్దీని అధికార యంత్రాంగం అంచనా వేయలేకపోయింది. దీంతో ఉదయం కొత్తూరు-జంపన్నవాగు మధ్య ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఆదివారం వారాంత సెలవు కావడంతో మహాజాతరకు ముందస్తుగా మొక్కులు చెల్లించుకోవడానికి భక్తులు వాహనాల్లో భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ క్రమంలో జంపన్నవాగు నుంచి హరితహోటల్ వరకు సుమారు కిలోమీటరున్నర వరకు గంటపాటు ట్రాఫిక్ జామ్ అయ్యింది. అప్రమత్తమైన పోలీసులు ప్రత్యేక పార్కింగ్ స్థలాల్లోకి వాహనాలను తరలించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.



ట్రాఫిక్‌జామ్‌లో ఇరుక్కున్న వాహనాలు

ప్రత్యేక ఓటరు జాబితాకు స్పెషల్ డ్రైవ్‌ను ఉపయోగించుకోవాలి



మల్యాలలో ఓటరు నమోదు ప్రక్రియ స్పెషల్ డ్రైవ్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్ టౌన్, జనవరి 21 : ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, సవరింపుల కోసం ఈనెల 21, 22 తేదీల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టామని, స్థానికంగా ఉన్న పోలింగ్‌కేంద్రాల్లో బీఎల్వోలకు సవరణ దరఖాస్తులను అందించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ సూచించారు. మండలంలోని బేతోలు, మల్యాల, చౌక్లతండాల్లో స్పెషల్‌డ్రైవ్‌ను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు నమోదు, సవరణకు అవసరమైన ఫారం 6,7,8లు బూత్‌లెవల్ అధికారుల వద్ద లభిస్తాయని చెప్పారు. 'ఆన్‌లైన్' ద్వారా యాప్‌లో నమోదు, పెండింగ్ లిస్ట్‌లను పరిశీలిస్తూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. 1 జనవరి 2024 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటుహక్కు కల్పించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. సాధ్యమైనంత వేగంగా పెండింగ్ ఫావ్‌లను పరిశీలన ప్రక్రియ చేపట్టాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సిబ్బందికి సలహాలు, సూచనలు ఇస్తూ అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మానుకోట ఆర్డీవో అలివేలు, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.

- కురవి : ఓటరు జాబితాలో మార్పులు.. చేర్పులు.. సవరింపుల స్పెషల్ డ్రైవ్ చేపట్టామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. చౌలతండా, కురవి, తాళ్లసంకీస గ్రామాల్లో బీఎల్వో సెంటర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లు స్థానికంగా ఉన్న పోలింగ్‌కేంద్రంలో బీఎల్వోలకు సవరించిన దరఖాస్తు అందించాలని తెలిపారు. ఓటరునమోదు, సవరణకు అవసరమైన 6,7,8 ఫారాలను బూత్‌స్థాయి అధికారుల వద్ద లభిస్తాయని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా యాప్‌లో నమోదు, పెండింగ్ లిస్టులను పరిశీలిస్తూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంత త్వరగా పరిశీలన ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఆర్డీవో ఆలివేలు, కురవి తహసీల్దార్ సునిల్‌రెడ్డి పాల్గొన్నారు.

'సోషలిస్టు సమాజ స్థాపనకు కృషి చేయాలి'

తొర్రూరు, జనవరి 21 : కమ్యూనిస్టు ఉద్యమనేత సమసమాజ స్థాపనే ధ్యేయంగా సోషలిస్టు కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం కోసం కృషి చేసిన లెనిన్ ఆశయ సాధన కోసం కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు తమ్మెర విశ్వేశ్వరరావు అన్నారు. ఆదివారం లెనిన్ జయంతి సందర్భంగా తొర్రూరు పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో ఆయన చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషలిజం స్థాపన కోసం ప్రపంచ వ్యాప్తంగా కార్మిక వర్గాన్ని ఒకటి చేసి వారి హక్కుల కోసం, సమసమాజ స్థాపన కోసం పాటుపడిన వ్యక్తి లెనిన్‌అని, ఉద్యమ నేతగా ఎన్నోపోరాటాలు నిర్మించి సోవియట్ యూనియన్ నిర్మాణంలో ప్రముఖపాత్ర వహించిన లెనిన్ ఆశయ సాధన కోసం కమ్యూ నిస్టులుగా, కార్మికవర్గ ప్రయోజనాలను కాపాడటం కోసం వారి హక్కులకు భంగం కలగకుండా ఉండేందుకు నిరంతర పోరాటాలు చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఓమ భిక్షపతి, లక్ష్మణ్, మహేందర్, మల్లయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

బౌద్ధమే సమాజానికి దిక్సూచి

వడ్డెపల్లి, జనవరి 21 : బౌద్ధమే సమాజానికి దిక్సూచి అని ప్రముఖ బౌద్ధ ప్రచారిణి బంతే సద్దా రక్షిత అన్నారు. ఆదివారం హనుమకొండలోని గౌతమ బుద్ధుడి విగ్రహం వద్ద బౌద్ధ ధర్మ ప్రచారంలో భాగంగా బుద్ధ వందనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఎస్‌పి నాయకులు బొమ్మల్ల అంబేద్కర్, మిద్దెపాక ఎల్లయ్య, చిట్యాల బాబు, ఇమ్మడి కొమురయ్య, ఏనుట్ల రవీందర్, దుర్గం స్వామి, సోమ రాంమూర్తి, కేడల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.













పోటీల్లో పాల్గొన్న రైల్వే కార్మికుల పిల్లలు

రైల్వే కార్మికుల పిల్లలకు క్రీడా పోటీలు

కాజీపేట, జనవరి 21: కాజీపేట రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో జనవరి 26ను పురస్కరించుకుని రైల్వే క్రీడా పోటీలు నిర్వహిస్తోంది. ఆదివారం రైల్వే కార్మికుల పిల్లలకు పెయింటింగ్, వ్యాసరచన, క్విజ్, క్రికెట్ పోటీలను నిర్వహించారు. మజ్దూర్ యూనియన్ డివిజన్ కార్యదర్శి పి.రవీందర్, ఏడీఈ ఎం.భాను ప్రసాద్ హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం రైల్వే స్టేడియంలో ఆర్పీఎఫ్, ఫ్రెండ్స్ 11 టీంల మధ్య జరిగిన పోటీలలో ఆర్పీఎఫ్‌టీం విజయం సాధించింది. మధ్యాహ్నం ఆపరేటింగ్ 1, ఆలేర్ పేవే టీంల మధ్య జరిగిన పోటీలలో ఆపరేటింగ్‌టీం విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, జాయింట్ సెక్రటరీ ఎం. రాజయ్య, కోశాధికారి జి. రాజేశ్వర్ రావు, ఇనిస్టిట్యూట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు



లెనిన్ ఆశయ సాధనకు విద్యార్థులు ఉద్యమించాలి




సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

హనుమకొండ రూరల్, జనవరి 21 : సమసమాజ స్థాపన, పీడిత ప్రజల హక్కుల కోసం కృషి చేసిన మహనీయుడు కామ్రేడ్ లెనిన్ అని, ఆయన ఆశయ సాధనకు విద్యార్థులు ఉద్యమించాలని అఖిల భారత కార్మిక సమాఖ్య జాతీయ అధ్యక్షుడు మారెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశం హనుమకొండలోని జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వెంకట్‌రెడ్డి ముందుగా లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లెనిన్ చనిపోయి వందేళ్లు గడుస్తున్నా అయనను అనుసరిస్తున్నామంటే ఆయన ఎంత త్యాగవంతుడో అర్థం చేసుకోవచ్చన్నారు. లెనిన్ ఆశయ సాధన కోసం విద్యార్థులు, యువత ముందుండి నడవాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను మార్చడం సిగ్గుచేటని మండిపడ్డారు. అలాగే ప్రజల హక్కులను కాలరాస్తూ పరిపాలన కొనసాగించడం బాధాకరమని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రలను తిప్పికొట్టే విధంగా లెనిన్ స్ఫూర్తితో ఉద్యమాలు కొనసాగించాలని ఆయన వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు వంగూరు వెంకటేశ్వర్లు, సామాజికవేత్త మాడిశెట్టి అరుణ్ కుమార్, ఆల్ ఇండియా కిసాన్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి ఎం.చంద్రారావు, ప్రజా సంఘాల నాయకులు ఎల్.శ్రీనివాస్‌రెడ్డి, బాబు, చంద్రశేఖర్, సాంబయ్య, మాదం తిరుపతి, మాలోతు రాజేష్ నాయక్, ఉదయ్ కుమార్, గణేష్, సునీల్‌చారి, రంగస్వామి, సందీప్, రాకేశ్, సతీష్, సురేశ్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.







సామాన్యులకు సైతం అందుబాటులో ఇస్రో

ఇస్రో రిటైర్డ్ శాస్త్రవేత్త డాక్టర్ సురేష్‌కుమార్

హనుమకొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : సామాన్యులకు సైతం అంతరిక్ష పరిశోధనా కేంద్రం(ఇస్రో) అందుబాటులో ఉందని, ఆసక్తి కలిగిన వారు అంతరిక్ష పరిశోధనల్లో పాల్గొనే అవకాశం ఉందని ఇస్రో రిటైర్డ్ శాస్త్రవేత్త డాక్టర్ టీఎన్ సురేష్‌కుమార్ అన్నారు. వరంగల్ నిట్‌లో టెక్నోజియాన్ ముగింపు రోజైన సోమవారం విద్యార్థులనుద్దేశించి అతిథి ప్రసంగం చేశారు. అంబేద్కర్ లెర్నింగ్ హాల్ నిర్వహించిన ఈ కార్యక్రమానికి విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. తన లాంటి సాధారణ వ్యక్తి ఇస్రోలో పని చేయగలిగితే మీలాంటి తెలివైన వారు ఎందుకు రాలేరు? అని విద్యార్థులనుద్దేశించి అన్నారు. కేవలం ప్యాకేజీలను మాత్రమే పరిగణలోకి తీసుకోకుండా దేశాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఇస్రో లాంటి పరిశోధనా కార్యకలాపాల్లో పాల్గొనాలన్నారు. నిట్ విద్యార్థులు అంతరిక్ష పరిశోధనా రంగం వైపు కూడా దృష్టి సారించాలని, ఇస్రోలో కీలక భూమిక పోషించాలని పిలుపునిచ్చారు. రియల్ టైమ్(నిజ సమయం) అనుభవాన్ని పొందడానికి ఇస్రో కేంద్రానికి రావాలని ఆహ్వానించారు. సాంకేతిక అభివృద్ధిలో కమ్యూనికేషన్ కీలక పాత్ర పోషించిందన్నారు. ఈ భూగోళంపై తాను ఇప్పటికే దాదాపు అన్ని దేశాలను తిరిగానని, తాను సందర్శించాల్సిన దేశాలు ఇంకా 25 మాత్రమే మిగిలి ఉన్నాయని, వాటిని రెండేళ్లలో పూర్తి చేస్తానన్నారు. సబ్ మెరైన్ నుంచి అంతరిక్షంలోకి వెళ్లిన మొదటి శాస్త్రవేత్తనుతానేనన్నారు. కరోనా కాలంలో తాను తన పరిశోధనతో కలిసి రేడియో ధార్మికతలు కరోనానుఏమైనా తగ్గిస్తాయా అన్న అంశంపై పరిశోధనలు చేశామన్నారు.


టెక్నోజియాన్‌లో మాట్లాడుతున్న ఇస్రో రిటైర్డ్ సైంటిస్టు డాక్టర్ సురేష్‌కుమార్

అలాగే ఇస్రోలో ఇంజనీరింగ్ స్రవంతిలోగల అవకాశాల గురించి డాక్టర్ సురేష్‌కుమార్ వివరించారు. భావసారూప్యత కలిగిన వ్యక్తులు ఒక్కటై అంతరిక్ష సాంకేతికతలో స్టార్టప్‌ల ఏర్పాటుగల అవకాశాలనుఅన్వేషించాలన్నారు. అంతరిక్ష పరిశోధన, ఇస్రో భవిష్యత్తులో చేపట్టనున్న ప్రయోగాలు తదితర అంశాలపై విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు, వెలిబుచ్చిన సందేహాలకు సురేష్‌కుమార్ సమాధానాలు ఇచ్చారు. అనంతరం నిట్ ప్రొఫెసర్లు ఆయనను సత్కరించారు.

ఆకట్టుకున్న జహాజ్

స్టాక్ వాతావరణం సృష్టించిన వరంగల్ ట్రేడింగ్ రింగ్

హనుమకొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : టెక్నోజియాన్ చివరి రోజు నిర్వహించిన కొన్ని ఈవెంట్లు విశేషంగా ఆకట్టుకున్నాయి. జహాజ్, వరంగల్ ట్రేడింగ్ రింగ్ ఇందులో కొన్ని.

జహాజ్..

జహాజ్ ఈవెంట్‌ను కాలేజీ ప్రభాన భవనం ఎదురుగా నీటి కొలనులో నిర్వహించారు. చేతితో తయారు చేసిన రిమోట్ నియంత్రిత పడవ ఇందులో హైలెట్. ఈ పడవ నీళ్లలో ఏర్పాటు చేసిన అడ్డంకులన్నిటినీ అధిగమించి గమ్యస్థానానికి చేరుకునేలా రిమోట్‌తో నడపాలి. ఎవరైతే విజయవంతంగా పడవను నిర్ధిత లక్ష్యానికి చేర్చుతారో వారే విజేత. ఈ స్పాట్ లైట్ ఈవెంట్‌ను ప్రతి సంవత్సరం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.



వరంగల్ ట్రేడింగ్ రింగ్

సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి రియల్‌టైమ్ స్టాక్ వాతావరణాన్ని ఈ ఈవెంట్ సందర్భంగా సృష్టించారు. ఇందులో పాల్గొనేవారికి వ్యాపారం చేయడానికి ఖాతాలు కూడా ఇచ్చారు. ఇందులో పాల్గొన్నవారు నిజంగా స్టాక్ ఎక్స్ఛేంజ్ కార్యకలాపాల్లోన్న అనుభూతికి లోనయ్యారు. ఎక్కువ డబ్బు సంపాదించినవారిని విజేతలుగా ప్రకటించారు.



మెకానికల్ కిట్ అసెంబ్లీ

ఈ ఈవెంట్‌లో పాల్గొనేవారు మెకానికల్ ఇంజనీరింగ్‌లోని ప్రతీ గేర్, స్క్రూ, విడి భాగాలను అసెంబ్లింగ్ చేయడంలో తమ ప్రతిభను చాటారు. తక్కువ సమయంలో విడిభాగాలను అసెంబ్లింగ్ చేసిన వారికి రివార్డు ఇచ్చారు.



మల్లన్నకు పట్నం భక్తుల పబ్బతి


మల్లన్నకు హారతి ఇస్తున్న అర్చకుడు


మల్లన్న ఆలయ ఆవరణలో భక్తజన సందోహం

కొమురవెల్లిలో హోరెత్తిన పట్నంవారం

భక్తజనసంద్రంగా ఆలయ పరిసరాలు

బోనాలు, పట్నాలతో దండిగా భక్తుల మొక్కులు

చేర్యాల, జనవరి 21: కోరమీసాల కొమురవెల్లి మల్లికార్జున స్వామికి పట్నం భక్తులు పబ్బతి పట్టారు. మది నిండా మల్లన్న నామస్మరణతో పాటు డప్పుచప్పుళ్ల దరువుల నడుమ శివసత్తుల సిగాలు, పూనకాలు, పోతురాజుల చిందులతో కొమురవెల్లి విజయాచల గుట్టలు హోరెత్తాయి. మల్లన్న బ్రహ్మోత్సవాలలో భాగంగా సంక్రాంతి పర్వదినం తరువాత వచ్చిన మొదటి వారాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్నంవారాన్ని భక్తులు ఘనంగా జరుపుకున్నారు. హైదరాబాద్ నుంచి సుమారు లక్ష మంది భక్తులు తరలిరావడంతో కొమరవెల్లి జనసంద్రంగా మారింది. శనివారం సాయంత్రం ధూళిదర్శనం చేసుకున్న భక్తులు ఆదివారం దండిగా మొక్కులు తీర్చుకున్నారు. భక్తిప్రపత్తులతో బోనాలు తయారు చేసి నైవేద్యాన్ని నివేదించారు. బస చేసిన ప్రాంతంలో, ఆలయ గంగరేగు చెట్టు ప్రాంతంలో, ముఖ మండపంలో మల్లన్నకు చిలుకపట్నం, నజరు, ముఖమండప పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారిని దర్శించుకుని చీర, సారెలతో ఒడిబియ్యాలు పోశారు. తమ కోరికలు నెరవేర్చమని గంగరేగు చెట్టుకు ముడుపులు కట్టారు. సంతానం కలిగించాలంటూ మహిళలు వల్లుబండ వద్ద వరం పట్టారు.

ఎల్లమ్మ దేవతకు బోనాలు

స్వామి వారి సహోదరి అయిన ఎల్లమ్మ దేవతకు బోనాలు నివేదించారు. డప్పుచప్పుళ్ల నడుమ సిగాలతో శివమెత్తుతూ ఎల్లమ్మతల్లి నామస్మరణతో గుట్టపైకి ఎక్కి అమ్మవారికి బోనాలు నివేదించి మొక్కులు తీర్చుకున్నారు.. బెల్లంపానకం, కల్లును నైవేద్యంగా సమర్పించి తమ పసుపుకుంకుమలు చల్లంగా చూడమని వేడుకున్నారు.

క్యూలైన్లలో పడిగాపులు

భారీగా భక్తులు హాజరవడంతో క్యూలైన్లన్నీ కిక్కిరిసిపోయాయి. పట్నాల మందిరంలోని క్యూలైన్లు నిండిపోయాయి. గంటల తరబడిగా క్యూలైన్లలో పడిగాపులు కాశారు. ఆలయ ఈవో బాలాజీ, పునరుద్ధరణ కమిటీ సభ్యులు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీశ్ పర్యవేక్షణలో చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 500 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో భారీ బందోబస్తు చర్యలు తీసుకున్నారు.

నేడు పట్నం, అగ్నిగుండాలు

ఆలయ తోటబావి ప్రాంగణంలో సోమవారం హైదరాబాద్ యాదవ సంఘం ఆధ్వర్యంలో పెద్దపట్నం రచించి అగ్నిగుండాలు దాటనున్నారు. వంటినిండా పసుపు ధరించి భక్తులు పట్నంతొక్కి అగ్నిగుండాలలో చిందేయనున్నారు.

అసెంబ్లీలో ఒక్కరున్నా..
కార్యకర్తల బలం ఉంది

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

సుబేదారి, జనవరి 21 : అసెంబ్లీలో సీపీఐ పార్టీకి ఒక్క ఎమ్మెల్యే ఉన్నా.. బయట లక్షలాది మంది కార్యకర్తల బలం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఆదివారం సీపీఐ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లాకార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సాంబశివరావు మాట్లాడుతూ.. పేదలు, కార్మికులు, కష్టజీవుల పక్షాన పోరాడేది కమ్యూనిస్టు లేనని అన్నారు. సమస్యలు ఉన్నంతకాలం ఎర్రజెండా ఉంటుందని, కమ్యూనిస్టులను మించిన త్యాగధనులు లేరన్నారు. పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు సాధిస్తామనే విశ్వాసం తనకు ఉందని, లేదంటే పోరాటమే మార్గమని అన్నారు. పేదల హక్కుల కోసం అసెంబ్లీలో, బయట పోరాడుతానన్నారు. కేంద్రంలో దేశాన్ని కార్పొరేట్ శక్తులకు తాకట్టుపెట్టిన బీజేపీని రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించి ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు అయన పిలుపునిచ్చారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధంలో భాగంగా వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ సీపీఐ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా 101 మందితో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, సీపీఐ ఉమ్మడి వరంగల్ జిల్లాల కార్యదర్శులు కర్రె భిక్షపతి, సీహెచ్. రాజారెడ్డి, బి.విజయసారథి, మేకల రవి, కె. రాజ్‌కుమార్, రాష్ట్ర, జిల్లాల నాయకులు పంజాల రమేష్, మండ సదాలక్ష్మి, మారుపాక అనిల్, ఆదరి శ్రీనివాస్, మద్దెల ఎల్లేష్‌లు సమావేశంలో పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు

చికిత్స పొందుతూ భర్త మృతి

కమలాపూర్, జనవరి 21: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న దంప తులను కారు ఢీ కొట్టడంతో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగా యాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ భర్త మృతి చెందగా, భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం మండలంలోని అంబాల వద్ద జరిగింది.. పోలీసు ఇన్స్‌పెక్టర్ బొలిమల్ల సంజీవ్ తెలిపి న వివరాలు ఇలా ఉన్నాయి.

మంచిర్యాల జిల్లాలోని మందమర్రి మండలంలోని రామకృ ష్ణాపూర్‌కు చెందిన బోయిని రవి(50) తన భార్య లతతో కలసి ద్విచక్ర వాహనంపై హనుమకొండకు బయలు దేరారు. హనుమ కొండలోని వారి బంధువుకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఆస్పత్రికి వెళ్ళి పరామర్శించారు. అనంతరం మండలంలోని గుండేడు గ్రామంలోని తమ బంధువుల ఇంటికి అదే ద్విచక్రవాహనంపై వస్తుండగా అంబాల గ్రామ శివారులోకి రాగానే ఎదురుగా అజాగ్రత్తగా, అతి వేగంగా వస్తున్న హనుమకొండకు చెందిన కారు, ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో దంపతులిద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. దీంతో చుట్టు పక్కల వారు సమాచారం ఇవ్వడంతో 108లో దంపతులను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో రవి చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడని తెలిపారు. కాగా, తీవ్రగాయాలైన లత పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైనా వైద్యం కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారని తెలిపారు. కాగా, మృతుడు ఎల్ఐసీ ఎజెంటుగా పని చేస్తున్నారని తెలిపారు. మృతుడి సోదరుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. కారు డ్రైవర్ పరారీలో ఉన్నారని రవికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారని ఇన్స్‌పెక్టర్ తెలిపారు.


ఆస్పత్రిలో మృతి చెందిన రవి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మడికొండ. జనవరి 21 : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం మడికొండలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మడికొండ నెహ్రూనగర్ కాలనీకి చెందిన బానోత్ మల్లేష్, బానోత్ యాకూబ్ ఇద్దరూ బైక్‌పై ధర్మసాగర్‌కు వెళ్ళి తిరిగి మడికొండకు వస్తున్నారు. ఈ క్రమంలో మడికొండలోని మా ఫంక్షన్ హాల్ సమీపంలోకి రాగానే మడికొండకు చెందిన జనగాం అరవింద్, ఏదుల రాకేష్ ఇద్దరూ బైక్‌పై వేగంగా వచ్చి బానోత్ మల్లేష్ బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టారు. దీంతో నలుగురు కిందపడిపోయారు. ప్రమాదంలో బానోత్ యాకూబ్, బానోత్ మల్లేష్, ఏదుల రాకేష్‌కు తీవ్ర గాయాలు కాగా జనగాం అరవింద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న స్థానిక పోలీసులు గాయపడిన వ్యక్తులను 108లో ఎంజీఎంకు తరలించారు. బైకులను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



గాయపడిన ఏదుల రాకేష్, బానోత్ యాకూబ్

మరిపెడ సంతకు వచ్చి..

గుండెపోటుతో రైతు మృతి

మృతుడు ఖమ్మం జిల్లా వాసి

మరిపెడ, జనవరి 21 : కూరగాయల అమ్మకానికి మరిపెడ సంతకు వచ్చిన ఓ రైతు గుండెపోటుకు గురై మృతి చెందాడు. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర విషాదం నింపింది. ఆ రైతు తను పండించిన టమాటలను ఆదివారం ఆటోలో మరిపెడ సంతకు తరలించి వాటిని దించుతుండగా కుప్పకూలాడు. చుట్టుపక్కల వారు గుర్తించి ఆస్పత్రికి తరలించేలోపే కన్నుమూశాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామానికి చెందిన రమణబోయిన రామస్వామి (56) తన టమాట తోట నుంచి టమాటలను ఆటోలో మరిపెడ సంతకు తీసుకొచ్చారు. వాటిని ఆటో నుంచి దించే క్రమంలో ఆయన గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతిచెందారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. వారం వారం జరిగే మరిపెడ సంతకు ప్రతీ ఆదివారం రమణయ్య పిండిప్రోలు ఊరు నుంచి కూరగాయలను ఆటోలో తీసుకొచ్చి అమ్ముకునేటోడు. ఈ ఆదివారం సైతం కూరగాయలను తెచ్చి అందరూ చూస్తుండగానే రమణయ్య మృత్యు ఒడికి చేరాడని సహచర చిరు వ్యాపారులు తమ కళ్ల ముందే జరిగిన రమణయ్య మృతి ఘటనతో కన్నీటి పర్యంతం చెందారు. కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలుపడంతో మృతదేహాన్ని సొంతూరుకు తరలించారు.


రామస్వామి మృతదేహం

అంతా రామమయం!

ఉమ్మడి జిల్లాలో ముస్తాబవుతున్న రామాలయాలు

అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో పూజలు

ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకించేందుకు ఏర్పాట్లు

హనుమకొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : అయోధ్యలో శ్రీ రామ మందిర ప్రతిష్ఠా మహోత్సవం జరుగుతున్న నేపథ్యంలో సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లా అంతటా పండుగ వాతావరణ నెలకొనబోతున్నది. ప్రతీ ఇల్లు ఓ పూజా మందిరంగా మారనున్నది. ఊరు వాడా జై శ్రీరామ్ నినాదాలతో మార్మోగనుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రామాలయాలన్నీ ఇప్పటికే అందంగా ముస్తాబయ్యాయి. వీటితో పాటు ఆంజనేయస్వామి గుళ్లన్నింటినీ ప్రత్యేక పూజల నిర్వహణకు సిద్ధం చేశారు. అయోధ్యలోని శ్రీ రామ మందిరంలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన జరిగే సమయంలో విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఓం పతాకాలతో పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసుకున్నారు.

పలు ఆలయాల్లో..

హనుమకొండ చౌరస్తా సమీపంలోని రాగన్న దర్వాజలోని పెద్ద కోవెల, చిన్న కోవెల, రాజ్‌పుత్‌వాడలోని రామాలయం, హనుమకొండ ఏకశిల పార్క్‌ను అనుకొని ఉన్న శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం, చేర్యాల మండలం ఆకునూరి రామాలయం, ఆత్మకూరు మండల కేంద్రంలోని ప్రాచీన వేణుగోపాలస్వామి ఆలయం, వరంగల్ ఎల్లంబజారులోని సీతా రామచంద్రస్వామి ఆలయం, కాజీపేట రైల్వేస్టేషన్ సమీపంలోని రామాలయం, వరంగల్ కాశిబుగ్గలోని రంగనాథ ఆలయం, వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలోని గుట్టపై ఉన్న గోవిందరాజస్వామి ఆలయం, జనగామ జిల్లా జీడికల్లులోని సుప్రసిద్ధ శ్రీరామ క్షేత్రం(వీరాచల క్షేత్రం), హనుమకొండ మచిలీబజార్‌లోని హనుమదాలయం, వరంగల్ కోటలోని రామాలయం, ధర్మసాగర్ మండలం వేలేరులోని రామాలయం, వరంగల్ శివనగర్‌లోని రామాలయం, హనుమకొండ రెవెన్యూ కాలనీలో రామాలయం, పరిమళ కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయం తదితర ఆలయాల్లో సోమవారం అయోధ్య రామ మందిరంలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సమయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు.

అక్షింతలు

ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అయోధ్య రామ మందిరం అక్షింతలు అన్ని ఆలయాలకు చేరుకున్నాయి. వాటిని విశ్వహిందూ పరిషత్, బీజేపీ కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. వీటిని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. సోమవారం అయోధ్యలో రామ మందిరంలో బాలరాముని విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ జరిగే సమయంలో తమ ఇళ్లలో కూడా పూజలు నిర్వంచి తాము స్వయంగా తయారు చేసుకున్న అక్షింతల్లో వీటిని కూడా కలిపి తలలపై చల్లుకోనున్నారు. పరస్పరం పంపిణీ చేసుకోనున్నారు. ఆలయాల్లో పూజల సందర్భంగా కూడా వీటిని భక్తులకు పూజారులు అందచేయనున్నారు. పక్షం రోజులుగా అయోధ్య రామ మందిరం అక్షింతల పంపిణీ జరుగుతోంది.

టీవీలలో వీక్షణం

రామ మందిరంలో రాముడి వ్రిగహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని టీవీలు, ఇతర మాధ్యమాల్లో ప్రత్యక్షంగా ప్రసారం చేయనున్నారు. దీనితో టీవీల్లో వీక్షించేందుకు భక్తులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రతిష్ఠాపన సమయంలో అందరూ ఇళ్లలో టీవీల ముందు కూర్చోనుండగా, ఆరు బయట ప్రదేశాల్లో, ఆలయాల ప్రాంగణాల్లో, పబ్లిక్ పార్కులు, టీవీ షోరూములు, వ్యాపార సంస్థలు, ఆధ్యాత్మిక మందిరాలలో భారీ డిజిటల్ స్క్రీన్లను ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు ప్రశాంతంగా కూర్చొని వీక్షించేందుకు వీలుగా టెంట్లను ఏర్పాటు చేస్తున్నారు. హాజరైన భక్తులకు పంపిణీ చేసేందుకు తీర్థ ప్రసాదాలను కూడా తయారు చేస్తున్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా భక్తి గీతాలాపనలు, భజనలు, సంకీర్తలను, నృత్య ప్రదర్శనలు నిర్వహించనున్నారు. పలువురు భక్తులు పక్షం రోజులుగా భక్తి గీతాల ఆలపన సాధన చేస్తూ శ్రీ రాముడిపై తమకున్న భక్తితత్వాన్ని చాటి చెబుతున్నారు. శ్రీరాముడి ఘట్టాల ప్రదర్శనకు నగరంలోని కొన్ని నృత్య శిక్షణా సంస్థల నిర్వాహకులు తమ వద్ద శిక్షణ పొందుతున్న విద్యార్థులతో ప్రత్యేక ప్రదర్శనకు చాలా రోజుల కిందటి నుంచే సన్నాహాలు చేస్తున్నారు.

శోభాయాత్రను సక్సెస్ చేయాలి

తొర్రూరు, జనవరి 21 : అయోధ్యలో బాలరామ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా సోమవారం తొర్రూరులో విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్ తదితర సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే శోభాయాత్రను విజయవంతం చేయాలని యాత్ర నిర్వాహకులు గుజరాతి శివకుమార్, సంతోష్ శర్మ కోరారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని ప్రధాన వీధుల్లో శ్రీరామ ధ్వజాలను, జెండాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని మధ్యాహ్నం 3 గంటలకు పాలకేంద్రం నుంచి శోభాయాత్ర ప్రారంభమవుతుందని, పాటిమీద ఉన్న రామమందిరం వద్ద యాత్ర ముగుస్తుందన్నారు. ఆలయ ప్రాంగణంలో విగ్రహ ప్రతిష్ఠను భక్తులు తిలకించేందుకు ఎల్ఈడీ స్ర్కీన్ల ఏర్పాటు, భజన, తీర్థ ప్రసాద వితరణ జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో హాజరై భగవంతుని కృపకు పాత్రులవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో గోపారపు నాగేశ్వర్‌రావు, నాగేంద్రచారి, కుమారస్వామి, కృష్ణమూర్తి, ఇమ్మడి రాంబాబు, రుద్రదేవ్, సందీప్ పాల్గొన్నారు.

'ఉపాధి వైపు దృష్టి సారించాలి'

నర్సింహులపేట, జనవరి 21 : యువత స్వయం ఉపాధి వైపు దృష్టి సారించి, ఆర్థికంగా వృద్ధి చెంది సమాజంలో గౌరవ మర్యాదలు పొందాలని డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ అన్నారు. లోక్యాతండా పంచాయతీ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గుగులోతు రాజు సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన సూపర్ మార్కెట్ జనరల్ స్టోర్‌ను ఆదివారం ప్రారంభించి, మాట్లాడారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జినుకల రమేష్, కదుదుల రామకృష్ణ, రమేష్‌రెడ్డి, లింగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ యువజన నాయకులు దాసరోజు రాజశేఖర్, బానోతు ధస్రూనాయక్, రేఖ అనిల్‌యాదవ్ పాల్గొన్నారు.



ఇనుగుర్తిలో శ్రీరాముడి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు కోసం పల్లకిని అందజేస్తున్న ముస్లింలు



డోర్నకల్ మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వహిందు పరిషత్ మహిళలు



మహబూబాబాద్‌లో జైశ్రీరాం అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీగా వెళ్తున్న బీజేపీ, వీహెచ్‌పీ శ్రేణులు

అంతా రామమయం

- జిల్లాలో మార్మోగిన శ్రీరామనామస్మరణ
- జైశ్రీరాం అంటూ పురవీధుల్లో భారీ ర్యాలీలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 21 : జిల్లా కేంద్రంలోని పురవీధుల్లో జైశ్రీరాం అంటూ భారతీయ జనతా పార్టీ, విశ్వహిందు పరిషత్ బాధ్యులు ఒద్దిరాజు రాంచందర్‌రావు, బవిరిశెట్టి శ్రీనివాస్, శ్రీరంగంమురళీ, ఇందు భారతి, బద్రీనాథ్, సోమ రాంబాబుల నేతృత్వంలో ఆదివారం భారీర్యాలీ చేపట్టారు. సోమవారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీరాముడి జన్మస్థలం అయోధ్యలోశ్రీరామమందిరం, బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని మానుకోట పట్టణంతో పాటు గ్రామాల్లోశ్రీరామనామస్మరణతో మార్మోగాయి. జనవరి 22న అయోధ్యలో ప్రతిష్ఠాత్మక రామమందిర ప్రాణప్రతిష్ఠ చేపట్టనుండగా శ్రీరామనామస్మరణతో జిల్లా వ్యాప్తంగా ఆధ్యాత్మికత సంతరించుకుంది. అదేరోజున ప్రతి ఇంటిలో ఐదు దీపాలు వెలిగించి, పండుగను జరుపుకునేలా ప్రజలంతా సిద్ధమయ్యారు. శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠలో భాగస్వాములు కావడం తమ పూర్వజన్మ సుకృతం అని భక్తులు విశ్వసిస్తున్నారు.

ఇంటింటికి జైశ్రీరాం జెండా ఆవిష్కరణ..

నెల్లికుదురు : మండలంలోని మేచరాజుపల్లిలో అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీ అభయాంజనేయభక్తమండలి ఆధ్వర్యంలో ఇంటింటికి జైశ్రీరాం జెండాఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో జైశ్రీరాం నినాదాలతో జెండాలతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. రామమందిరం ప్రారంభోత్సవానికి తరలిరావాలని గ్రామస్థులు కోరారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి, నవీన్‌రావు, సర్పంచ్ వెలిశాల లక్ష్మీ దేవేందర్‌రావు, పర్నే ప్రభాకర్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

- డోర్నకల్ : అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణపతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకుని డోర్నకల్ విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. డోర్నకల్ మెయిన్‌రోడ్డు మీదుగా రైల్వే రామాలయం వరకు ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ లడ్డా, రమాకాంత్ లడ్డా, విజయ్‌కుమార్‌బట్టడ్, పండరీనాథ్, గోపాల్, రాధాదేవి పాల్గొన్నారు.

పల్లకిని అందజేసిన ముస్లింలు..

ఇనుగుర్తి : శ్రీరాముడి ఊరేగింపు కోసం పల్లకిని అందజేసి, ముస్లింలు తమ హిందూభక్తిని చాటుకున్నారు. ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన రబ్బానికి ఇలియాజ్, ఇంతియాజ్, రియాజ్ అనే ముగ్గురు కుమారులు ఉన్నారు. వారు తమ తండ్రి రబ్బాని జ్ఞాపకార్థంగా అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఇనుగుర్తిలో శ్రీరాముడి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు కోసం తమసొంత ఖర్చులతో తయారు చేసిన పల్లకిని అర్చకుడు కృష్ణమాచార్యులుకు అందజేశారు. స్థానిక లక్ష్మీనర్సింహస్వామి ఆలయ అర్చకుడు కృష్ణమాచార్యులు మాట్లాడుతూ శ్రీరాముడి ఊరేగింపు కోసం ముస్లింలు పల్లకిని అందించడం గొప్ప విషయమని కొనియాడారు. రబ్బాని కుమారులు మాట్లాడుతూ శ్రీరాముడి కోసం పల్లకిని అందించడం ఆనందంగా ఉందని, హిందూవులు, ముస్లింలు అంతా ఒక్కటేనని, మతాలకంటే మానవత్వం గొప్పదని అన్నారు. పూజారి కృష్ణమాచార్యులు, ఎంపీటీసీ పింగిలి రజితశ్రీనివాస్, వద్దిరాజు పెద్ద వెంకటేశ్వర్లు, పోతుల సంజీవరెడ్డి, నవనందుల శ్రీనివాస్, బాలాజీ, పొన్నం కవిత, యాకేష్, శ్రీరాం, చందర్ పాల్గొన్నారు.

ఎంపీ సీటు ఆదివాసీలకు కేటాయించాలి

- ఆదివాసీ సంఘాల జేఏసీ చైర్మన్ దాట్ల నాగేశ్వర్‌రావు

మహబూబాబాద్ టౌన్, జనవరి 21 : మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం లోకసభ సీటును ఆదివాసీలకే కేటాయించాలని ఆదివాసీ సంఘాల రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ దాట్ల నాగేశ్వర్‌రావు విజ్ఞప్తి చేశారు. మానుకోటలోని కొమురంభీంభవన్‌లో ఆదివారం ఆదివాసీ సంఘాల జేఏసీసమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ములుగు, పినపాక, భద్రాచలం, ఇల్లందు అసెంబ్లీ సెగ్మెంట్‌లలో ఆదివాసీల జనాభా ఎక్కువగా ఉందని చెప్పారు. అనంతరం ఈసారి ఆదివాసీలకు అవకాశం కల్పించిన పార్టీలకు మాత్రమే ఆదివాసీలు ఓటువేసి గెలిపించుకుంటామని ముక్తకంఠంతో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఈసం సుధాకర్, పడిగ నాగేశ్వర్‌రావు, చంద్రయ్యదొర, సత్యనారాయణ, కోటి, సుమన్, తాటి మధు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి విరాళం

నెల్లికుదురు, జనవరి 21 : మండల కేంద్రంలో రైతులు వ్యవసాయ భూముల వద్దకు వెళ్లడానికి రోడ్డు పనులకు మాజీ ఎంపీటీసీ పులిరామలక్ష్మీ రామచంద్రు.రూ 20 వేలు విరాళం అందజేశారు. నెల్లికుదురు మండల కేంద్రం నుంచి వ్యవసాయ భూముల వద్దకు రైతులు వెళ్లడానికి రోడ్డులేక పోవడంతో రైతులు స్వంత ఖర్చులతో రోడ్డు పనులు చేపట్టారు. ఈ పనులకు నిధులు సరిపోక పోవడంతో స్పందించిన పులిరామలక్ష్మీ రామచంద్రు 20 వేల రూపాయల విరాళం అందజేసి, రోడ్డుపనులకు సహకరించడం పట్ల రైతులు కృతజ్ఞతల తెలిపారు.

జీవో అమలుల విస్మరణపై ఆందోళనలు

- సీపీఐ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ అజయ్‌సారథి



మాట్లాడుతున్న అజయ్‌సారథిరెడ్డి

మహబూబాబాద్ టౌన్, జనవరి 21 : మహబూబాబాద్ మునిసిపాలిటీకి అభివృద్ధి కోసం రాష్ట్ర మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ జీవోలు ఇచ్చి అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 23, 24, 25 తేదీల్లో నిరసన ఆందోళనలు చేపడుతున్నట్లు మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి తెలిపారు. మహబూబాబాద్ వీరభవన్‌లో ఆదివారం సీపీఐ అర్బన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ 30 జనవరి 2023న ఎస్డీఎఫ్ నిధులు రూ.50 కోట్లు మంజూరి చేస్తూ ఇచ్చిన జీవో నెంబరు 34, మాజీమంత్రి కేటీఆర్ పలు వార్డుల అభివృద్ధికి రూ.2 కోట్లు మంజూరు చేస్తూ 23 మే 2018న ఇచ్చిన జీవో నెంబరు 367ను అమలు చేయకుండా విస్మరించారని విమర్శించారు. గత బీఆర్ఎస్ సర్కార్ జీవోలో ఇవ్వడమే తప్పనిధులు మంజూరు చేయలేదని మండిపడ్డారు. మూడు రోజులపాటు 36 వార్డుల్లో ఆందోళనలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ సమావేశలో పట్టణ కార్యదర్శి పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, శ్రావణ్, మాలోతు రవీందర్, భాగ్య, నక్క నాగార్జున, శ్రీనాథ్, రమేష్, మల్లికార్జున్, బాలాజీ, శ్రీకాంత్, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా ఉమామహేశ్వర్



గూడూరు, జనవరి21 : మండలం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా కొండూరు ఉమామహేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా జూలూరు శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు నాళ్ల నర్సింహారావు తెలిపారు. గూడూరు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం కమిటీని ఎన్నుకున్నారు. నాయకులు బొల్లం సాంబమూర్తి, నరేష్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

మహబూబాబాద్ టౌన్, జనవరి 21 : వచ్చే వేసవిలో పట్టణంలో తాగునీటిసమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మునిసిపల్‌చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మూడు కొట్ల సెంటర్‌వద్ద మిషన్‌భగీరథ పైపులైన్ లీకేజీలను ఆదివారం పరిశీలించారు. తక్షణమే మరమ్మత్తులు చేపట్టి నీరువృథా కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మిషన్‌భగీరథ పైపులైన్ లీకేజీలను ముందస్తుగా గుర్తించి వాటి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. మిషన్‌భగీరథ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

'ఇష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 21 : పాఠశాలస్థాయి నుంచే నిర్దేశిత లక్ష్యాన్ని ఎంచుకొని ఇష్టంతో చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి అన్నారు. మానుకోట ఏకశిల ఏంజిల్స్ హైస్కూల్‌లో ఆదివారం ఎస్సెస్సీ విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. మానుకోట డీఎస్పీ సత్యనారాయణ మాట్లాడుతూ తల్లిదండ్రులు కష్టనష్టాలకోర్చి మిమ్ములను చదివిస్తున్నారని, వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా ఉత్తమఫలితాలు సాధించాలన్నారు. సీఐ రమేష్, డైరెక్టర్ కొండల్‌రెడ్డి, ఈసీజీ శివప్రసాద్, శ్రీనివాస్, సాంబయ్య ప్రిన్సిపాల్ రమేష్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

కేసముద్రం, జనవరి 21 : కేసముద్రం స్టేషన్‌లో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కొల్లూరు శంకరయ్య సహకారంతోఅన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు బెజ్జం ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో వరుసగా 21 రోజులుగా అన్నదానం చేస్తున్నామని తెలిపారు. క్లబ్ కార్యదర్శి పరాంకుశం శ్రీహరి, వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కె.చంద్రశేఖర్, యర్నం శ్రీరాములు, నాగేశ్వరాచారి, చింత కరుణాకర్, మారం సమ్మిరెడ్డి తదితరులు మాట్లాడారు.

రాష్ట్రస్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శనకు ప్రాజెక్టుల ఎంపిక

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 21 : రాష్ట్రస్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శనకు జిల్లా నుంచి పది ప్రాజెక్టులు ఎంపికైనట్లు డీఈవో రామారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇటీవల ఆన్‌లైన్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శనలో అన్ని యాజమాన్య పాఠశాలల విద్యార్థులచే 135 ఎగ్జిబిట్లు ప్రదర్శించగా వాటిల్లో ఉత్తమమైనవి 10 రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు డీఈవో పేర్కొన్నారు. ఇందులో జూనియర్ విభాగం నుంచి ఐదు, సీనియర్ విభాగం నుంచి ఐదు ప్రాజెక్టులు ఎంపికయ్యాయని తెలిపారు. సీనియర్ విభాగంలో మానుకోట మోడల్ స్కూల్ విద్యార్థి ఆర్ మణిదర్‌సాయి, జడ్పీహెచ్ఎస్ తొర్రూరు విద్యార్థి సాయి అక్షిత్, జడ్పీహెచ్ఎస్ పెద్దవంగర విద్యార్థి బి.హేమంత్, మోడల్ స్కూల్ మరిపెడ విద్యార్థి ఎ.అజయ్, జడ్పీహెచ్ఎస్ కంబాలపల్లి విద్యార్థి ఎ.సజని ఎంపికయ్యారని తెలిపారు. జూనియర్స్ విభాగంలో ఎంపీయూపీఎస్ బ్రాహ్మణకొత్తపల్లి విద్యార్థి అఫ్రోజ్‌పాషా, జడ్పీహెచ్ఎస్ కంబాలపల్లి విద్యార్థిని ఎ.హిందు, ఈఎంఆర్ఎస్ బయ్యారం విద్యార్థి బి.అరవింద్, టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ ఇనుగుర్తి విద్యార్థిని హిమవర్షిణి, అరవింద్ హై స్కూల్ గూడూరు విద్యార్థిని శ్రీవర్షిని ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు డీఈవో తెలిపారు.

మానవాళి విముక్తికి దారి చూపిన లెనిన్

మహబూబాబాద్ రూరల్, జనవరి 21 : ప్రపంచంలో మానవాళి ఎదుర్కొంటున్న దోపిడీ, పీడనలపై లెనిన్ చూపిన దారి మార్గదర్శకంగా నిలిచిందని సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర కార్య దర్శివర్గ సభ్యుడు పాయం చిన్న చంద్రన్న, రాష్ట్ర నాయకుడు నాయిని రాజులు అన్నారు. మహబూబాబాద్ ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం లెనిన్ శతవర్ధంతి సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి రవి, పూనెం ప్రభాకర్, జగ్గన్న, బిల్లకంటి సూర్యం, రాజేశ్వర్‌రెడ్డి, సూరి, వెంకటేశ్వర్లు, ఉమగాని సత్యం, భాస్కర్‌రెడ్డి, పైండ్ల యాకయ్య, పాపయ్య, మౌలాన, బలరాం, శంకరయ్య పాషా, కొమురయ్య పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్..?

తొర్రూరు రూరల్, జనవరి 21 : మండలంలోని కంఠాయపాలెం గ్రామ శివారు కస్నాతండా శివారు ఆకేరువాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు సమాచారం. కస్నాతండా నంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో అక్కడికి చేరుకున్న పోలీసు సిబ్బంది రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు గ్రామస్థుల నుంచి తెలిసింది. అయితే ఈ విషయంపై ఎస్సై జగదీష్‌ను వివరణ కోరగా తండాలో ఇసుక డంప్‌చేసి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు సిబ్బందిని పంపించి ఇసుక డంప్‌లను గుర్తించామని తెలిపారు. గుర్తించిన ఇసుక డంపులను రెవెన్యూ అధికారులకు అందజేసి, సీజ్ చేస్తామన్నారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తేకఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

'యాదవులు అన్నిరంగాల్లో రాణించాలి'

పెద్దవంగర, జనవరి 21 : యాదవులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని తెలంగాణ యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు సూత్రపు రాజుయాదవ్ పిలుపు నిచ్చారు. ఆదివారం మండలకేంద్రంలోని సాయి గార్డెన్‌లో తెలంగాణ యాదవ మహాసభ మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రెడ్డబోయిన గంగాధర్‌యాదవ్, ఉపాధ్యక్షుడిగా కేశబోయిన సుభాష్‌యాదవ్, కూకట్ల వీరన్నయాదవ్, ప్రధాన కార్యదర్శిగా జిట్టే రమేష్‌యాదవ్, సహాయ కార్యదర్శిగా వల్లంల భిక్షపతియాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సూత్రపు రాజుయాదవ్ మాట్లాడుతూ యాదవులు విద్యా, ఉద్యోగ, వాణిజ్య రంగాల్లో రాణించాలన్నారు. యాదవులందరూ కలిసికట్టుగా పని చేయాలని యాదవ సామాజిక వర్గం ఐక్యమత్యంతో ఉంటే బీసీ సామాజిక వర్గాలు యాదవుల వెంటే నడుస్తాయన్నారు. అనంతరం నూతన క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు రాసాల సమ్మయ్య, వెంకటనారాయణ, సధాకర్, ప్రవీణ్, పూర్ణచందర్, కుమర స్వామి, పరమేష్, సమ్మయ్య, భిక్షపతి పాల్గొన్నారు.

చిల్డ్రన్ పార్కులో దారుణం

- ఆటవస్తువులతో ఆడుకుంటున్న క్రమంలో విరిగిన బొటనవేలు

మహబూబాబాద్ టౌన్, జనవరి 21 : మహబూబాబాద్ శివారు హౌసింగ్ బోర్డు కాలనీలోని చిల్డ్రన్ పార్కులో ఆరేళ్ల బాలిక రిషిక ఆడుకుంటున్న క్రమంలో ఆట వస్తువులకు తగిలి ఎడమ చేయి బొటనవేలు విరిగి. ఊసిపోయింది. సీరోలు మండలం కాంపెల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కుమ్మరి సోమేశ్వర్-స్వప్న దంపతులు తమ ఆరేళ్ల కూతురు రిషికతో కలిసి మానుకోటలో ఓ శుభకార్యానికి హాజరయ్యారు. ఈక్రమంలో బాలిక రిషిక హౌ'సింగ్‌బోర్డు కాలనీలోని చిల్డ్రన్ పార్కులో ఆడుకుంటుండగా ఎడమచేయి బొటనవ్రేలు విరిగి ఊసిపోయింది. గమనించిన తల్లిదండ్రులు వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్సనందిస్తున్నారు. కాగా చిల్డ్రన్ పార్కులో తుప్పుపట్టి విరిగిన ఆటవస్తువులుండడం వల్ల ఈ ఘటన జరిగిందని పలువురు ఆరోపిస్తున్నారు. పార్కుల్లో తుప్పుపట్టిన వస్తువులను మార్చి కొత్తవి అమర్చాలని కోరుతున్నారు.

'డైరెక్టర్ త్రివిక్రమ్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 21 : గుంటూరు కారం సినిమాలో విలన్‌లకు మార్క్స్, లెనిన్ పేర్లు పెట్టిన డైరెక్టర్ త్రివిక్రమ్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ నాయకులు కేలోతు సాయికుమార్, బోనగిరి మధు డిమాండ్ చేశారు. మహబూబాబాద్ అంబేద్కర్ విగ్రహం ఎదుట సదరు సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం డైరెక్టర్ త్రివిక్రమ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సినిమా కలెక్షన్ల కోసం మహనీయుల పేర్లను వాడుకోవడం బుద్ధి మాలిన చర్య అన్నారు. వెంటనే విలన్‌లకు పెట్టిన వీరి పేర్లను తొలగించాలని, డైరెక్టర్ త్రివిక్రమ్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గుగులోతు సూర్యప్రకాష్, బానోత్ సింహాద్రి, భూక్య రాజేష్, ఉపేందర్, భాస్కర్, విజయ్, దిలీప్, చింటు పాల్గొన్నారు.

మరిపెడ : విప్లవ వీరులను అవమాన పరిచేలా నిర్మించిన గుంటూరు కారం సినిమాను సెన్సార్ బోర్డు నిషేధించాలని మరిపెడ మండల సీపీఎం కార్యదర్శి దుండి వీరన్న డిమాండ్ చేశారు. ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. డైరెక్టర్‌పై ఏపీ, తెలంగాణ పోలీసులు కేసునమోదు చేయాలన్నారు. అవసరమైతే తమ పార్టీ, అనుబంధ సంఘాలచే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు.

దోపిడీలేని సమాజ స్థాపనకు కృషి చేసిన లెనిన్

కురవి, జనవరి 21 : దోపిడీ పీడనలకు వీలులేని సమాజ స్థాపనకు లెనిన్ కృషి చేశారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. కురవిలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం లెనిన్ శత వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ కార్మిక, రైతురాజ్య నిర్మాణం చేసి నూతన జీవన విధానాన్ని ప్రజలకు అందించిన గొప్ప విప్లవకారుడు లెనిన్ అని కొనియాడారు. దున్నేవాడికే భూమిని పంచిన గొప్ప వైతాళికుడు లెనిన్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కర్నం రాజన్న, కన్నె వెంకన్న, దూదికట్ల సారయ్య, కొంతం సత్యం, బొల్లం ఉప్పలయ్య, నిలుగొండ నాగేశ్వర్‌రావు, విజయ్ పాల్గొన్నారు.

'దేవాలయం అభివృద్ధి పాటుపడుతాం'

గార్ల, జనవరి 21 : వేట వేంకటేశ్వస్వామి దేవాలయం అభివృద్ధికి పాటుపడుతామని ఎన్ఆర్ఐ పులి గోపాల్‌రెడ్డి-పమీల దంపతులు హామీ ఇచ్చారు. గత ఏడాది దేవాలయం అభివృద్ధి సుమారు రూ.కోటి 50.లక్షలు ఆర్థిక సహాయం చేసినా.. తిరిగి అమెరికా ప్రయాణంలో భాగంగా వీరు ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. గోపాల్‌రెడ్డి కోడలు అమెరికా వాసి టానియారెడ్డి దేవాలయం చుట్టూ సోలార్ పెంకింగ్ ఏర్పాటుకు తనవంతు ఆర్థికగా తోడ్పాటును అందజేస్తానని ఆలయ కమిటీ హామీ ఇచ్చారు. గంగవత్ లక్ష్మణ్‌నాయక్, ఎలమరెడ్డి కిష్టారెడ్డి, అమర్‌చంద్, పల్లఖండం రమేష్ బాబు, మురళీధర్ రెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, జితేందర్‌కుమార్ అగ్రవాల్ పాల్గొన్నారు.

'ఆలయ నిర్మాణానికి సహకరించాలి

తొర్రూరు, జనవరి 21 : ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని వెలికట్టె గ్రామ సర్పంచ్ పోసాని పుష్పలీల సంతోష్ అన్నారు. ఆదివారం తొర్రూరులో పలువురు దాతల నుంచి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో నిర్మించే ఆలయ నిర్మాణానికి పట్టణ కేంద్రానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి బొమ్మనబోయిన రాజేందర్ రూ.2 లక్షలు, రైస్‌మిల్ నిర్వాహకుడు మహ్మద్ అన్వర్ రూ.50వేలు, వ్యాపారి చిదిరాల నవీన్‌కుమార్ రూ.25 వేలు ఇచ్చారన్నారు. ఆలయ కమిటీ సభ్యులు పోసాని రాములు, కోమాళ్ల దామోదర్ రావు, దేశగాని కుమార్, వెంకటేశ్వర్, రాజు ఉన్నారు.

'గోవులను రక్షించడం ప్రతీ ఒక్కరి బాధ్యత'

నెల్లికుదురు, జనవరి 21 : గోవులను రక్షించడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల యాదవరెడ్డి తెలిపారు. నెల్లికుదురులో ఆదివారం కన్యాకపరమేశ్వరి గోశాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఇంట్లో గోవులను పెంచుకోవాలన్నారు. ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి, సర్పంచ్ బీరవెల్లి యాదగిరిరెడ్డి, ఎంపీటీసీ వెన్నాకుల వాణి శ్రీనివాస్, వేముల బాబ్జి, పెరమాండ్ల గుట్టయ్య, కాసం వెంకటేశ్వర్‌రెడ్డి, గడ్డం అరుణ్‌కుమార్ గోశాల సొసైటీ నిర్వహకులు అండెం శ్రీధర్, అల్లి మధుసుదన్‌రెడ్డి పాల్గొన్నారు.

బానోత్ రమేష్‌కు పుడమి సేవారత్న అవార్డు

నెహ్రూసెంటర్, జనవరి 21 : మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సంపూర్ణ సురక్ష కేంద్రం మేనేజర్ బానోత్ రమేష్‌కు 2024 పుడమి సేవారత్న అవార్డు లభించింది. తెలంగాణ పుడమి సాహితీవేదిక 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విశిష్ట సేవా పురస్కారాలను అందజేశారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సంపూర్ణ సురక్ష కేంద్రంలో హెచ్ఐవీ పట్ల నిత్యం సేవా కార్యక్రమాలు చేస్తున్నందున ఆయన సేవలను గుర్తించి నల్గొండ జిల్లాలో ఆదివారం జరిగిన పుడమి సేవారత్న అవార్డు ప్రదానోత్సవంలోఅవార్డును ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి, పుడమి సాహితీ వేదిక అధ్యక్షుడు చిలుముల బాల్‌రెడ్డి చేతుల మీదుగా రమేష్ అవార్డు అందుకున్నారు. పుడమి సేవారత్నం అవార్డు అందుకోవడం పట్ల ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది రమేష్‌ను అభినందించారు.



హోమం నిర్వహిస్తున్న జైనమతస్తులు

నూతన జైన మందిరానికి విగ్రహాల తరలింపు

డోర్నకల్, జనవరి 21 : మునిసిపల్ కేంద్రంలో నూతనంగా నిర్మించిన జైన మందిర ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా మూడవ రోజు ఆదివారం విగ్రహాల తరలింపు కార్యక్రమం నిర్వహించారు. ఉదయం పాత జైన మందిరం నుంచి నూతన జైనమందిరంలోనికి విగ్రహాలను తరలించారు. ఈ సందర్భంగా మహిళలు ఘట్‌యాత్ర నిర్వహించారు. మధ్యాహ్నం జైన్‌భవన్ వద్ద యాగ్ మండల్ విధాన హోమం చేపట్టారు. సోమవారం జైనమందిరంలో విగ్రహాల ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జైన మతపెద్దలు కిశోర్‌కుమార్‌జైన్, సుమీర్‌చంద్‌జైన్, మహేందర్‌జైన్‌లు తెలిపారు.

'ఏకలవ్య ప్రిన్సిపాల్ రవిబాబుకు అవార్డు'

బయ్యారం, జనవరి 21 : విద్యారంగ నిర్వాహణలో మంచి నాయకత్వ ప్రతిభ కనబర్చిన బయ్యారంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాల (ఈఎంఆర్ఎస్) ప్రిన్సిపాల్ రవిబాబుకు అవార్డు వరించింది. ఎడ్యుకేషన్ గ్రోత్ నెట్‌వర్క్ (ఈజీఎన్) సంస్థ ప్రభుత్వ ప్రైవేట్ అనే తేడా లేకుండా ప్రతీ ఏడాది దేశవ్యాప్తంగా తిరుగులేని నాయకత్వ ప్రతిభ కనబర్చి విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తున్న పలువురిని పురస్కారంతో సత్కరిస్తారు. అందులో భాగంగా ఈ ఏడాది ఈజీఎన్ సంస్థ బయ్యారంలోని ఈఎంఆర్ఎస్ ప్రిన్సిపాల్ రవిబాబుకు అవుట్ స్టాండింగ్ ఎడ్యుకేషన్ లీడర్‌షిప్ అవార్డు ప్రదానం చేసి సత్కరించారు. కాగా, శనివారం నాడు ప్రిన్సిపాల్ రవిబాబు హైదరబాద్‌లోని మేరిట్ హోటల్, కన్వెన్షన్ సెంటర్ నందు ఈజీఎన్ సంస్థ డైరెక్టర్లు విఘ్నేశ్వర్‌దాస్, చంద్రశేఖర్ చేతుల మీదిగా ఈ అవార్డు అందుకున్నారు. ప్రిన్సిపాల్‌కు అవుట్ స్టాండింగ్ ఎడ్యుకేషన్ లీడర్‌షిప్ అవార్డు వరించడం పట్ల ఈఎంఆర్ఎస్ వైస్ ప్రిన్సిపాల్ గీతతో పాటు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తు అభినంచారు.

వేంను కలిసిన కాంగ్రెస్ నేతలు

మహబూబాబాద్ టౌన్, జనవరి 21 : సీఎం, ప్రభుత్వ సలహాదారుడిగా నియామకమైన వేం నరేందర్‌రెడ్డిని హైదరాబాద్‌లో మానుకోట జిల్లా కాంగ్రెస్ నేతలు ఆదివారం కలిశారు. నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. మానుకోట అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, నాయకులు సంజీవరెడ్డి, యాదవరెడ్డి, ప్రభాకర్‌గౌడ్, వెంకటేశ్వర్లు, సీతారాంరెడ్డి, మల్లయ్య, నాగరాజు, గోవర్ధన్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మిర్చి రైతుల పరేషాన్

- నల్లతామర, జెమిని వైరస్‌తో తోటలకు నష్టం
- జిల్లాలో తగ్గిన దిగుబడి



పెనుగొండలో ఎండిపోయిన మిర్చితోట

మహబూబాబాద్ అగ్రికల్చర్, జనవరి 21 : జిల్లాలో మిర్చి దిగుబడి తగ్గిపోయింది. నల్లతామరతో పాటు జెమిని వైరస్ (బొబ్బరోగం)తో తోటలకు నష్టం వాటిల్లింది. దీంతో కొన్ని మండలాల్లో దిగుబడి మరీ తగ్గిపోయింది. సాగుచేసిన రైతులు బేజారవుతున్నారు. ప్రస్తుతం మిర్చి కోత దశ ఊపందుకుంది.

జిల్లాలో 70, 236 ఎకరాల్లో సాగు..

మహబూబాబాద్ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 70,236 ఎకరాల్లో సాగు చేశారు. గతేడాది మిర్చితో నల్లతామర తెగులు సోకడంతో దిగుబడి రాక ఆర్థికంగా నష్టపోయారు. ఈ సారైనా పంటకు అధిక దిగుబడి వచ్చి, లాభాలు గడిస్తామని మిర్చివేస్తే మొక్క దశలోనే నల్లతామర సోకింది. ఎన్ని క్రిమిసంహారిక మందులు వాడుతున్నా.. ఈ తెగులు తగ్గకపోగా మరోవైపు జెమిని వైరస్ సోకింది. ఆ రెండు వైరస్‌లతో పాటు మరో వైరస్ కూడా సోకడంతో మిర్చిమొక్కలు వాడిపోయి, ఎండిపోయాయి. నివారణకు రైతులు వేలాది రూపాయలు ఖర్చుపెట్టి క్రిమిసంహారిక మందులు వాడిన తగ్గలేదు. ఈ తెగుళ్లతో పసుపురంగుతో ఉన్న జిగురు అట్టలు ఎకరాకు 15 నుంచి 20 పెట్టుకోవాలని, దాంతో వేపనూనె కలిపిన క్రిమిసంహారిక మందులు పిచికారి చేసుకోవాలని ఉద్యానవన శాఖ అధికారులు రైతులు చైతన్య పరచడంతో కొద్దిమేర తెగుళ్ల ఉధృతి తగ్గింది. కానీ, పంట దిగుబడి అంతంత మాత్రమే వచ్చింది.

ఎకరాకు పెట్టుబడి రూ.60 వేలు..

మిర్చిపంట మంచిగా పండితే ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. కొన్ని మండలాల్లో ఈ వైరస్ వల్ల 12 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని వెల్లడిస్తున్నారు. మరికొన్ని మండలాల్లో 5 నుంచి 8 క్వింటాళ్ల మిర్చి దిగుబడి వచ్చిందని రైతులు చెబుతున్నారు. ఎకరం మిర్చిపై రూ.60 వేల నుంచి రూ.80 వేల వరకు ఖర్చుచేశామని, పెట్టుబడి భారీగా అయిందని, చేతికి వచ్చిన మార్కెట్‌కు తీసుకువస్తే పెట్టిన పెట్టుబడి కూడ వస్తుందో.! రాదోనని? రైతులు ఆందోళన చెందుతున్నారు.